
సాక్షి జగిత్యాల

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. మొక్కులు చెల్లించుకున్న భక్తులు ఇంటిదారి పట్టారు.



14న సీఎం కేసీఆర్ రాక

సీఎం కేసీఆర్ ఈనెల 14న కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకోనున్నారు. అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0/17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడానికి అవకాశముంటుందని మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలు క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో ఉంచుకోవడం వల్ల కక్షిదారులు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. రెండు వర్గాలు రాజీ కుదుర్చుకుంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రితోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై రైతుల నిరసన



ఆందోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి(కోరుట్ల): జగ్గాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు శనివారం ఆందోళనకు దిగారు. వ్యవసాయ రంగానికి 24గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కోతలతో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల ఆందోళనకు ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం పంటలకు సరిపడే విధంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'గల్ఫ్ కార్మికుల గోడు పట్టదా?'

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ వెళ్లిన లక్షలాది మంది కార్మికుల సంక్షేమం ప్రభుత్వానికి పట్టదా? అని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక దమామ్ ఇన్‌చార్జి బాలసాని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. సౌదీలోని దమామ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరాయి దేశాల్లో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి వెతలు తీర్చేందుకు ఎన్ఆర్ఐ పాలసీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక దమామ్ కో ఆర్డినేటర్లు బోగ శ్రీనివాస్, నవీన్, మచ్చర్ల ఆదిరెడ్డి, తిరుపతి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జగిత్యాలక్రైం: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ భాస్కర్ కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఉమెన్స్ సేఫ్టీ వింగ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని 60 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 240 మంది విద్యార్థులు, 128 మంది ఉపాధ్యాయులకు సైబర్ భద్రతపై ఆన్‌లైన్ పద్ధతిన శిక్షణ ఇచ్చారు. సైబర్ నేరాలపై అవగాహన, నివారణ గురించి ఆన్‌లైన్‌లో పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి ప్రజల్ని, విద్యార్థుల్ని చైతన్య పర్చడమే సైబర్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం వంటి సోషల్ మీడియాలను పిల్లలు ఎక్కువగా వినియోగిస్తున్నారని తెలిపారు. వాటిని వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లితండ్రులు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ కాంగ్రెస్‌లో నేర్చుకున్న విషయాలను అబాంసి దర్లు తోటి విద్యార్థులు, తల్లితండ్రులకు వివరించి చెప్పాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు కూడా సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని చెప్పారు.



నాపేరు సునీత. వయసు 68 ఏళ్లు. రోడ్డుపై ఒంటరిగా ఉన్న నన్ను నాలుగేళ్ల క్రితం రామగుండం కార్పొరేటర్ ఎండీ. ముస్తాఫా పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర ఆశ్రమంలో చేర్పించాడు. బంధువులు ఎందరో ఉన్నా.. ఆదరణ లేక ఇక్కడే ఉంటున్నా. కాళ్లనొప్పులు, ఆస్తమా సమస్యలతో బాధపడుతున్నా. ఆశ్రమ నిర్వాహకుడు నాకు మూడుపూటల భోజనం పెట్టి కొడుకులా చూసుకుంటున్నాడు.



నా పేరు వైద్యుల మల్లారెడ్డి. మా ఆవిడ పేరు రాజవ్వ. సొంతూరు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్. వ్యవసాయం చేసుకుంటూ బతికేటోళ్లం. మంచిగా ఆస్తి సంపాదించిన. కొడుకులు బాసటగా ఉంటారనుకున్నా. కానీ ఉన్న ఆస్తిని వాళ్లపేరున చేయించుకున్నారు. మా ఇద్దరిని వెళ్లగొట్టారు. ఐదేళ్లుగా గోదావరిఖనిలోని శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమంలో ఉంటున్నాం. మాకు కొడుకులు, బిడ్డలు.. వాళ్ల పిల్లలతో హాయిగా ఆడుకోవాలని, కలిసిఉండాలని అనిపిస్తుంది. కానీ కన్న రక్తం మమ్మల్ని గెంటేశాక దినమొక నరకంగా బతుకుతున్నాం.



నాపేరు శ్రీపతి లక్ష్మి. మాది రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నంకెపల్లి. భర్తకు పక్షవాతం వచ్చి చనిపోయిండు. నాకు ముగ్గురు కొడుకులు.. ముగ్గురు కూతుళ్లు. ఏం లాభం.. బుక్కెడు అన్నం పెట్టేందుకు ఎవరికీ చేతులు రావడం లేదు. అందరూ కలిసి ఇంట్లోంచి వెళ్లగొట్టారు. తెలిసినోళ్లు గోదావరిఖనిలోని ఆశ్రమంలో ఉంచారు. కొన్నేళ్లుగా ఇక్కడే బతుకుతున్న. కడుపున పుట్టిన ఆరుగురు ఉన్నా అనాథగా ఉంటున్న.



జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామానికి చెందిన కట్కూరి రాజయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఎవరికి వారు బతుకుతున్నారు. కొడుకులు ముగ్గురూ వంతులవారీగా తల్లిదండ్రుల బాగోగులు చూస్తున్నారు. అయితే.. వృద్ధాప్యానికి తోడు రాజయ్య దంపతులను అనారోగ్య సమస్యలు వెంటాడాయి. ఆస్పత్రిలో చూపించుకునేంత స్తోమత లేదు. కొడుకులను ఇబ్బంది పెట్టేందుకు ఇష్టం లేదు. ఈ క్రమంలో గతేదాది నవంబరు 10వ తేదీన దంపతులు ఇద్దరూ సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. నోటులో రాశారు.

ఆశ్రమాల్లో అనాథలుగా..

సండే స్పెషల్

అయినవారు అందరూ ఉన్నా.. పట్టించుకునేవారు లేక

- తోడులేక.. నీడలేక వృద్ధుల పాట్లు
- చివరి అంకంలో ఆశ్రమాల్లో బతుకీడుస్తూ..
- పిల్లలకు భారంగా ఉండలేక.. బాధను దిగమింగలేక..
- బలవన్మరణానికి పాల్పడుతున్న మరికొందరు

నవమాసాలు మోసి పురిటినొప్పులను ఆనందంగా భరిస్తుంది తల్లి. తన రక్తాన్ని పాలుగా మలిచి ఆకలిని తీరుస్తుంది. బిడ్డకు చిన్న ఆపదొచ్చినా.. కన్నపేగు విలవిల్లాడుతుంది.

బుడిబుడి అడుగులు వేసే సమయంలో వెన్నంటే ఉంటాడు నాన్న. జీవితంలో తప్పటడుగులు వేయకుండా దారి చూపుతాడు.

పిల్లలు భవిష్యత్‌లో ఇబ్బంది పడొద్దని అన్ని విధాలా సమకూరుస్తారు తల్లిదండ్రులు. సమాజంలో దర్జాగా తిరిగేలా చేస్తారు. పిల్లలను ఉన్నతంగా స్థిరపరిచేందుకు జీవితాన్నే దారబోస్తారు. అయితే.. రెక్కలొచ్చిన పక్షుల్లాగా.. కొందరు పిల్లలు మలివయసులో తల్లిదండ్రులను అనాథలను చేస్తున్నారు. తమకు భారంగా ఉంటున్నారని ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. వృద్ధాప్యంలో పిల్లలకు భారం కావొద్దని కొందరు తనువు చాలిస్తున్నారు.

- సాక్షి, కరీంనగర్ డెస్క్

మారుతున్న కాలం..

ఒకప్పుడు కుటుంబం అంటే తల్లి,తండ్రి.. కొడుకు, కోడలు.. పిల్లలుగా భావించేవారు. ఇప్పుడు పెళ్లయిన కొన్నాళ్లకే తల్లిదండ్రులను దూరం పెడుతున్నారు. వారి నుంచి సంక్రమించే ఆస్తిపాస్తులు దక్కించుకుని తల్లిదండ్రులను కూడా పంచుకుంటున్న ఘటనలు తరుచూ కళ్లముందు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఆస్తిని దక్కించుకుని తల్లిదండ్రులను దూరం కొడుతున్నారు. మరికొందరైతే ఉద్యోగం రీత్యా దంపతులు ఇద్దరూ బిజీగా ఉంటున్నామని తల్లిదండ్రులను ఆశ్రమాల్లో అప్పగించేస్తున్నారు. వారికి నెలకు కావాల్సిన భత్యం కూడా నిర్వాహకులకు అందిస్తున్న వైనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు వృద్ధాశ్రమాల్లో కనిపిస్తోంది.

ఆదరణ లేక.. ఆరోగ్యం సహకరించక..

పిల్లలు జీవితంలో స్థిరపడిన తరువాత తల్లిదండ్రులు కోరుకునేది వారి నుంచి ప్రేమను మాత్రమే. అయితే ఆ ప్రేమను పొందలేక.. ఆదరణ లభించక చాలా మంది వృద్ధులు కుమిలిపోతున్నారు. మలి వయసులో వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో కొడుకులకు భారం కావొద్దని జగిత్యాల జిల్లాలో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. కొడుకులకు లక్షల ఆస్తిని పంచి ఇచ్చినా బుక్కెడు బువ్వ పెట్టకుండా తండ్రిని గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. గతేడాది సెప్టెంబరు 13న వేములవాడ



రూరల్ మండలం పట్టింల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారిని కలిసి తన కొడుకు పైసలిస్తలేడని ఎట్ల బతకాలి అని ఫిర్యాదు చేశాడు. ఇవే కాదు.. జిల్లాలో వెలుగులోకి రాని ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్నాయి. తమకొడుకులు పట్టించుకోవడం లేదని నిత్యం ఏదో ఒక పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు పండుటాకులు. అనారోగ్యం.. ఆర్థిక, కుటుంబ సమస్యలు... పిల్లలు చేరదీయక పోవడంతో రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో 120 మందికి పైగా వృద్ధులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.

వృద్ధుల రక్షణ చట్టం

2007లో 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం'ను పార్లమెంట్ ఆమోదించింది. తల్లిదండ్రుల విషయంలో వారి పిల్లలు వ్యతిరేక ధోరణితో అనుసరిస్తున్న వైఖరికి ఈ చట్టం రక్షణగా నిలుస్తోంది. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసినవారికి 3నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తారు. తల్లిదండ్రుల పోషణ, వైద్యానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలని చట్టం నిర్దేశిస్తోంది. తల్లిదండ్రులకు ఏమైనా స్థిరాస్తులు ఉంటే వాటిని పొందడానికి కూడా వీలులేకుండా వారసులను అనర్హులుగా నిర్ణయించవచ్చు. ప్రతీ జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అభాగ్యులైన వృద్ధ దంపతులకు అండగా నిలిచే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చట్టం చెబుతోంది. ట్రిబ్యునల్ నిర్ణయం మీద అప్పీలు ఉండదు. కేసు పెండింగ్‌లో ఉన్నకాలంలో నెలసరి భత్యం కూడా చెల్లించాలి. విచారణ చేపట్టే ముందు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సయోధ్య చేపట్టాలి. ఈ చట్టం కింద తాత, అమ్మమ్మ, నాయనమ్మల పోషణ కూడా కొడుకులు, మనవలు, దత్తపుత్రుల బాధ్యత. అయితే మైనర్లకు మాత్రం ఈ చట్టం మినహాయింపు ఇచ్చింది.

40 కరీంనగర్‌లోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో ప్రస్తుతం ఉంటున్న వారు.

45 కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న వాసవి వృద్ధుల ఆశ్రమంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నవారు.

15 కరీంనగర్‌లోని అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారి సంఖ్య. ఇదీ నగరంలోని యజ్ఞ వరాహస్వామి ఆలయం సమీపంలో ఉంటుంది.

60 కరీంనగర్ రూరల్ మండలం పరిధిలోని ఇరుకుల్ల గ్రామంలో ఉన్న పద్మనాయక వృద్ధుల ఆశ్రమంలో ఉన్నవారి సంఖ్య.

14 సిరిసిల్ల పరిధిలోని రగుడుశివారులో బీటీ భూంరావు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల సంఖ్య. ఇందులో 8మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు.

21 తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లగిశెట్టి విశ్వనాథం ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు. ఇందులో పదిహేను మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఉంటున్నారు.

19 రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారు.

14 పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో శ్రీధర్మశాస్త్ర ఆశ్రమం 30మందితో 2012లో ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం 14మంది వృద్ధులు ఉంటున్నారు.

కళ్లెదుటే కన్నకొడుకు దుర్మరణం

- కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు
- తాటిచెట్టుకు ఢీకొని బాలుడి మృతి
- శుభకార్యానికి వెళ్లివస్తుండగా ప్రమాదం
- తల్లిదండ్రులకు గాయాలు
- బోరున విలపించిన బాలుడి అక్క



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

జగిత్యాలక్రైం: అమ్మానాన్నలతో కలిసి ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఏలేటి సాత్విక్‌రెడ్డి(12) దుర్మరణం చెందాడు. కళ్లెదుటే కన్నకొడుకు మృతి చెందడంతో ఆ దంపతుల దుఃఖానికి అవధుల్లేకుండా పోయాయి. జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన ఏలేటి మహిపాల్– మౌనిక దంపతులు తమ కుమార్తె సహస్ర, కుమారుడు సాత్విక్‌రెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి సుమారు 3 కి.మీ. దూరంలోని తక్కళ్లపల్లి గ్రామంలో జరిగే ఓ శుభకార్యానికి కారులో వెళ్లారు. బంధువులతో కలిసి ఎంతో ఉల్లాసంగా గడిపారు. శుభకార్యం పూర్తయ్యాక విందు భోజనం చేశారు. రాత్రి సమయంలో స్వగ్రామానికి బయలు దేరారు. మహిపాల్ కారు నడుపుతున్నాడు. ఓ పదినిమిషాల్లో ఇంటికి చేరుకునేవారు. అంతలోనే ఓ కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న తాటిచెట్టును ఢీకొట్టింది. ముందుసీట్లో ఉన్న మహిపాల్, భార్య మౌనికకు గాయాలయ్యాయి. వెనుక సీట్లో కూర్చున్న సాత్విక్‌రెడ్డి కారులోంచి ఎగిరి రోడ్డుపై మృతి చెందాడు. అప్రమత్తమైన సహస్ర తమ బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వారు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.



సాత్విక్ రెడ్డి(ఫైల్)

తమ్మా ఎప్పుడు వస్తావు..

కారు ప్రమాదంలో సాత్విక్‌రెడ్డి మృతి చెందగా అతడి అక్క సహస్ర ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. అయితే, తన తమ్ముడు మృతి చెందాడని తెలిసి 'తమ్మా.. నువ్వు ఎప్పుడు వస్తావు' అని రోదించడం పలువురిని కన్నీరు పెట్టించింది. గాయాలపాలైన తల్లితండ్రులు.. తమ కళ్ల ముందే కొడుకు మృతి చెందడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. సాత్విక్‌రెడ్డి తిప్పన్నపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మృతితో పాఠశాల యజమాన్యం శనివారం పాఠశాలకు సెలవు ప్రకటించింది. సాత్విక్‌రెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సందర్శించారు.

దళితబంధు యూనిట్ల పర్యవేక్షణ

మేడిపెల్లి(వేములవాడ): కట్లకుంటలో దళితబంధు ద్వారా ఏర్పాటు చేసిన యూనిట్లను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ శనివారం పర్యవేక్షించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూనిట్లు పరిశీలిస్తున్న బండ శ్రీనివాస్

చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం ప్రతీఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్‌తో సమన్వయ సమావేశం నిర్వహించారు. జడ్జి నీలిమ మాట్లాడుతూ, చట్టాలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేయాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో లేకుండా పోలీస్, రెవెన్యూ అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆర్డీవో మాధురి, డీఎస్పీ ప్రకాశ్ పాల్గొన్నారు.

రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లే..

కేసును రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కేసు పరిష్కారం..

ధర్మపురిలో 2021లో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇందుకు కారణమైన వ్యక్తిని మహారాష్ట్రలోని చంద్రాపూర్ జైలుకు తరలించారు. ఆ ఖైదీతో ప్రధాన న్యాయమూర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పరిష్కరించారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించేలా ఒప్పందం కుదిర్చారు.

1,617 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌లో 1,17 కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి నీలిమ తెలిపారు. ఇందులో 23 సివిల్, 1,594 క్రిమినల్, మిగతావి మోటారు వాహనాల కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

శాసనమండలిలో మనోళ్లకు చోటు

- చీఫ్‌విప్‌గా భానుప్రసాద్.. విప్‌గా కౌశిక్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా శాసన మండలికి ఎన్నికైన తానిపర్తి భానుప్రసాద్‌రావును చీఫ్‌విప్‌గా, ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డిని విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

- భానుప్రసాద్‌రావు 2009లో కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో చేరి 2014లో మరోసారి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ముచ్చటగా మూడోసారి మళ్లీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2021 డిసెంబర్ 14 న జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. గతంలో భానుప్రసాద్‌రావు శాసనమండలి విప్‌గా పనిచేశారు.
- శాసనమండలి విప్‌గా ఎంపికైన పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.



భానుప్రసాద్‌రావు



పాడి కౌశిక్‌రెడ్డి

అనంతరం కాంగ్రెస్ క్యాడర్‌తో సహా టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కౌశిక్‌రెడ్డిని మొదటగా గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రభుత్వం నామినేటెడ్ చేయగా గవర్నర్ నిరాకరించారు. దీంతో ఆయనను ఎమ్మెల్యేల కోటా కింద శాసనమండలికి పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. తాజాగా శాసనమండలి విప్‌గా కేబినెట్ ర్యాంకును కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్ఎస్ పార్టీని కరీంనగర్ జిల్లాలో తిరుగులేని శక్తిగా తయారు చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆంధ్రా పోలీసుల అదుపులో యువకులు?

కోరుట్ల: పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను ఆంధ్రప్రదేశ్‌లోని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక శ్రీనివాస్ రోడ్డులో ఫ్రేమ్ మేకర్ ప్రింటర్ షాప్ నడుపుతున్న అర్జున్‌తోపాటు మరో యువకుడిని శనివారం సాయంత్రం ఆంధ్రా నుంచి వచ్చిన సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకొని తమవెంట తీసుకుకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఇద్దరు ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరేమైనా ఇతర కారణాలు ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు యువకుల అరెస్టుపై సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

ముగిసిన నృసింహుని బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఏకాంతోత్సవంతో 12రోజులుగా సాగుతున్న వేడుకలు ముగిసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి ఏడున్నర నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పవళింపు సేవ నిర్వహించారు. ఆ తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అర్చకులు వొద్దిపర్తి పెద్దసంతోష్, చిన్నసంతోష్, మధుకుమారాచార్యుల ఆధ్వర్యంలో ఈ తంతు జరిపారు. ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ నేరెళ్ల సుమన్‌గౌడ్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, మాజీ చైర్మన్లు గొడుగు కేశవులు, భైరవేని ఆంజనేయులు, గోనే రమణరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ పలువురు ఎంపీటీసీలు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, పలువురు ఎంపీటీసీలు హైదరాబాద్‌లో అసెంబ్లీ వేదిక వద్ద ఎమ్మెల్యేను కలుసుకుని విన్నవించారు. ఒక్కో ఎంపీటీసీకి రూ.10 లక్షలు మంజురు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఎంపీటీసీలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్, కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయానికి నోటీసులు

బుగ్గారం(ధర్మపురి): స్థానిక గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త, మానవ హక్కుల సంఘం సభ్యుడు చుక్క గంగారెడ్డి కొంతకాలంగా పోరాటం చేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులూ చేశారు. తనకు సంతృప్తికరమైన సమాచారం ఇవ్వలేదనీ, అలాగే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ గంగారెడ్డి నేరుగా రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. స్పందించిన కమిషన్.. తగిన సమాచారంతో ఈనెల 16వ తేదీన తమ ముందు హాజరుకావాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులకు నోటీసులు జారీచేసింది. గంగారెడ్డి మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, అవినీతికి పాల్పడి ఉన్నతాధికారులు బుగ్గారం గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని కప్పిపుచ్చుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఇప్పటికే జిల్లాలోని ఉన్నతాధికారులపై లోకాయుక్తాలో సైతం కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ట్యాంకర్ నుంచి డీజిల్ లీక్

మెట్‌పల్లి(కోరుట్ల): పెట్రోల్ బంక్‌కు డీజిల్‌ను సరఫరా చేసే ఓ ట్యాంకర్ నుంచి ఇంధనం లీకైంది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో ఉండే ఓ బంక్‌కు ఘట్‌కేసర్ నుంచి ఓ ట్యాంకర్‌లో శుక్రవారం రాత్రి డీజిల్ సరఫరా చేశారు. ట్యాంకర్ ఓ చోట దెబ్బతినడంతో ఆర్మూర్ నుంచి ఇంధనం లీకవుతూ వచ్చింది. ఈ విషయంలో డ్రైవర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. బంక్ వరకూ ట్యాంకర్‌ను అలాగే తీసుకొచ్చాడు. గమనించిన బంక్ నిర్వాహకులు.. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ తీరుపై పలువురు అగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ బిల్లు పేరుతో సైబర్ నేరగాళ్ల వల

జగిత్యాలక్రైం: వృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కూడా తమ మోసాలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాలంటూ కొందరికి శనివారం మెసేజ్‌లు పంపించారు. బిల్లులు వెంటనే చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని పేర్కొన్నారు. తక్షణమే 62979 61688 నంబరులో సంప్రదించాలని సూచించారు. బిల్లులు చెల్లించిన వారికి ఈ మేసెజ్ రావడంతో అప్రమత్తమైన వినియోగదారులు.. సైబర్ నేరగాళ్ల కుట్రను పసిగట్టి బూతులు తిట్టి ఫోన్ పెట్టేశారు.

కొంత ఖర్చు.. మరికొంత పొదుపు

- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం
- నేటినుంచి జిల్లావ్యాప్తంగా సదస్సులు


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

జగిత్యాలజోన్: ప్రజలు ఎంతోకొంత సంపాదిస్తున్నా.. పొదుపు ఎలా చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అధిక వడ్డీలకు ఆశపడి కష్టార్జితాన్ని అప్పగిస్తే తెలిసిన వాళ్లే నమ్మకంగా మోసం చేస్తున్నారు. ఇలాంటి వారికోసం బ్యాంకులు పలు పథకాలు ప్రవేశపెడుతున్నా క్షేత్రస్థాయిలో వారి దరిచేరడంలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. అంతేకాదు.. భావి యువతరానికి పాఠశాలలు, కళాశాలల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే పరిస్థితి కూడా లేదు. ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత సాధనకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈనెల 12–17వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందించింది.

లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో..

- జిల్లాలోని లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత సదస్సుల నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు.
- ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కౌన్సెలర్‌ను నియమించారు.
- కౌన్సెలర్‌తో కలిసి బ్యాంకు అధికారులు గ్రామాలకు వెళ్లి పొదుపు మార్గాలపై ప్రజలకు వివరిస్తారు.
- ముఖ్యంగా, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు, రైతులకు ఆర్థిక రంగంలో వస్తున్న మార్పుల గురించి వివరిస్తారు.
- సంపాదించిన డబ్బును ఎలా పొదుపు చేయాలి, ఎక్కడ పొదుపు చేస్తే ఏ మేరకు లాభం వస్తుంది, బ్యాంకు డిపాజిట్లలో వడ్డీ రేట్లు ఎంత, బంగారం కొనుగోలు చేస్తే లాభమా.. నష్టమా, వృద్ధులు ఎక్కడ డిపాజిట్ చేసుకోవచ్చు, యువకులు ఎలా డిపాజిట్ చేస్తే ఎక్కువ వడ్డీ వచ్చే అవకాశం ఉందనే అంశాల గురించి వివరిస్తారు.

గతేడాది 136 సదస్సులు..

జిల్లాలో గతేడాది ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల సహకారంతో 136 ఆర్థిక అక్షరాస్యత సదస్సులు నిర్వహించారు. డిజిటలైజేషన్ నేపథ్యంలో సమయాన్ని వృథా చేయకుండా బ్యాంకుల్లో డబ్బు ఎలా జమచేయాలి, ఎలా డ్రా చేయాలనే దానిపై వివరించారు. సాంకేతికత నేపథ్యంలో ఖాతాదారులు ఎలాంటి మోసాలకు గురవుతున్నారో జిల్లాలో జరిగిన సంఘటనలు ఉదహరిస్తూ వివరించారు. బ్యాంకు అధికారులు కస్టమర్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఫోన్ చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఏటీఎం పిన్ నంబరు, పాస్‌వర్డ్‌లతో జరిగే మోసాల గురించి వివరించారు.

ఈసారి 17 వరకు వారోత్సవాలు..

- ఆర్‌బీఐ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 12–17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తారు.
- ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కలెక్టర్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో లీడ్ బ్యాంకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.
- ఇందులో భాగంగా 2కే రన్ వంటి వాటితో ప్రజల్లోకి వెళ్లేందుకు పూనుకుంది.
- కొందరు నెలకు రూ.లక్ష వరకు సంపాదిస్తున్నా నెల చివరి నాటికి చేతిలో రూపాయి కూడా ఉండటం లేదు.
- దీంతో కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమవుతున్నాయి.
- ఇలాటి వారు వృథా ఖర్చులను ఎలా తగ్గించి, మిగిలిన సొమ్మును ఎలా పొదుపు చేయాలనే దానిపై సదస్సుల్లో అవగాహన కల్పిస్తారు.
- కోరికలకు తగినవిధంగా ఆదాయం లేకపోవడంతో ఫైనాన్స్‌లను ఆశ్రయించి అప్పుల ఊబిలో ఎలా కూరుకుపోయి, అప్పు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి ఉదాహరణలతో వివరిస్తారు.

పొదుపు అవసరం



కుటుంబ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత సదస్సులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సంపాదించిన దానిని ఎలా పొదుపు చేసుకోవాలి, వీలైనంత ఖర్చు ఎలా తగ్గించుకోవాలనే అంశాలపై వివరిస్తాం. జిల్లాలో జరిగిన సంఘటనలను ఉదాహరణలుగా చెబుతున్నాం.

– వెంకట్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్

సంపాదనపై అవగాహన లేదు



చాలామంది రూ.లక్షల్లో సంపాదిస్తున్నా.. ఆర్థిక అక్షరాస్యతపై వారికి అవగాహన ఉండటం లేదు. చేసే ఖర్చు పై అదుపు లేకుండా పోతోంది. అధిక వడ్డీలకు ఆశపడి నిండా మునుగుతున్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులను వివిధ గ్రూపులుగా ఏర్పాటు చేసి సదస్సులు నిర్వహిస్తాం.

– మధుసూదన్, కౌన్సెలర్

కాలువలో పడి ఒకరి మృతి


మల్యాల(చొప్పదండి): బహిర్భూమి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్యాల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం టీఆర్ నగర్‌కు చెందిన షేక్ ఖాదర్(47)ను భార్య గతంలోనే వదిలేసి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసై, భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 8న సాయంత్రం నుంచి ఖాదర్ కనపడకుండా పోయాడు. టీఆర్‌నగర్ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఖాదర్ చెప్పులు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. కాలువలో పడి ఉంటాడని కాలువ వెతకగా, లంబాడిపల్లి సమీ పంలోని ఎస్సారెస్పీ సైఫన్ వద్ద శవమై కనిపించాడు. శవాన్ని బయటకు తీశారు. మృతుడి అన్న షేక్ ఖలీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి..

ధర్మపురి: రోడ్డు పక్క నుంచి కాలినడకన వెళ్తున్న వ్యక్తిని కారు వెనుకనుంచి ఢీకొట్టడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంటాల బీరయ్య(40) శనివారం రాత్రి కిరాణంలో వస్తువులు కొనుగోలు చేసేందుకు రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక నుంచి అతి వేగంగా దూసుకు వచ్చిన కారు బలండగా ఢీకొట్టడంతో బీరయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కొంత కాలం క్రితమే చనిపోయారు. బీరయ్య తన అక్కాబావల సంరక్షణలో ఉంటున్నాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న ఏఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

- రూ.30.55 లక్షలు మంజూరు
- 5,992 మందికి ప్రయోజనం


కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు పస్తులు ఉంటూ చదువుకోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని భావించిన ప్రభుత్వం.. టిఫిన్(స్నాక్స్– అల్పాహారం) సౌకర్యం కల్పించడానికి నిధులు మంజూరు చేసింది.

జిల్లాలో 5,992 మంది టెన్త్ విద్యార్థులు..

- జిల్లాలోని 197 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 5,992 మంది ఉన్నారు.
- వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8.30 – 9.30 వరకు, సాయంత్రం 4.30 – సాయంత్రం 5.30గంటల వరకు ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నారు.
- దీంతో విద్యార్థులు ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి పాఠశాలలకు చేరుకుంటున్నారు.
- ఉదయం అల్పాహారం చేయకుండానే బడిలో మధ్యాహ్న భోజనం పెట్టేంత వరకూ వరకు పస్తులు ఉంటున్నారు.
- మధ్యాహ్న భోజనం చేశాక రాత్రి 7 గంటల వరకు భోజనం చేసే అవకాశం లేదు.
- దీంతో విద్యార్థులు అలసటకు గురై చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు.
- వీరికి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

జిల్లాకు రూ.30.55 లక్షలు..

ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉదయం టిఫిన్, సాయంత్రం టీ సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేయనున్నారు. ఈనెల 15– ఏప్రిల్ ఒకటో తేదీ వరకు టిఫిన్ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం రూ.30.55 లక్షలు ఇటీవల మంజూరయ్యాయి.

పక్కాగా అమలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రత్యేక తరగతుల కు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందు కు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. సర్కారు ఆదేశాలను పక్కగా అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం.

– ఆనందరావు, ఎంఈవో, కథలాపూర్

'కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి'

ధర్మపురి: నాగారం గ్రామానికి చెందిన పసుల అనిల్ మృతికి కారణమైన రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమలాపూర్ మార్గంలోని పెట్రోల్ బంక్ సమీపంలో అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మించడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి అనిల్ మృతి చెందాడని ఆరోపించారు. శనివారం జరిగిన యువకుడి అంత్యక్రియలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడారు. నాయకులు దినేశ్, రాజేశ్, లక్ష్మణ్, మొగిలి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అవినీతి కల్వకుంట్ల పాలనను తరిమికొట్టాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ


మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): బంగారు తెలంగాణ అంటూ పేదలను మోసం చేస్తున్న అవినీతి కల్వకుంట్ల కుటుంబ పాలనను ప్రజలు తరిమికొట్టాలని బీజేపీ నాయకురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ కోరారు. తక్కళ్లపెల్లి, సిరికొండ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోందన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి ఓట్ల కోసం హామీలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. రైతులకు మేలు చేసే సూరమ్మ, రాళ్లవాగు ప్రాజెక్టుల విషయంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు మొలిగె శ్రీనివాస్, మల్యాల మారుతి, జిల్లా సత్యం, నరెడ్ల రవీందర్ రెడ్డి, మేడిపెల్లి గంగాదర్, ప్రతాప్‌రెడ్డి, మహేశ్, లోకిని గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన రైతు నాయకులు

- ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిపించాలని విన్నపం
- శాసనసభలో ప్రస్తావించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని రైతు ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడుపుతామని తెలంగాణలో జరిగిన మొదటి ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్ఎస్.. ఆ పని చేయకుండా.. నడిచే ఫ్యాక్టరీని మూసివేసిందని వివరించారు. అప్పటినుంచి ఈ ప్రాంత రైతులు చెరుకును కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలించడంతో రవాణా భారం పడుతోందని తెలిపారు. శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావించి పునరుద్ధరణ కోసం పార్టీ తరఫున కృషి చేస్తామని భట్టి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజిరెడ్డి, షేర్ నర్సారెడ్డి, లింబాద్రి, నగేశ్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ పెద్దపల్లి పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా 186 చ॥గజాల 2 ప్లాట్లు అమ్మబడును. కావలసిన వారు సంప్రదించగలరు. నో బ్రోకర్స్ సంప్ర॥ 9949305965 [K-1232841]

■ 1) Iconic Infra(Hyd) సాగర్ హైవే ఫేసింగ్ యాచారం DTCP ప్లాట్లు Nr. ఫార్మాసిటీ & 85ఎ॥ HMDA లేఅవుట్ విజయవాడ హైవే@ చౌటుప్పల్ RRR ప్రక్కన 9154102338 [HA-10737]

■ హైదరాబాద్, ఇబ్రహీంపట్నం–జనహర్ష డ్రీమ్ సిటీ– 1 & 2లోని ప్లాట్లు అమ్మబడును. మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345 [H-793508]

SERVICES

■ అధార్‌కార్డ్, పాన్‌కార్డ్, కలిగి స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు ఋణాలు ఇవ్వబడును. సంప్ర: 9014653011, 9391225462 [H-793602]

CHANGE OF NAME

■ I MIRIYALA PADMA W/o MIRYALA BHOOPATHI RAO (Old Name), H.No. 9-4-187, Srinagar Colony, Sapthagiri Colony, Dist: Karimnagar. Have Changed my Name as MIRIYALA PADMA RANI W/o MIRIYALA BHOOPATHI RAO (New Name) [K-1219953]

■ I MIRYALA BHOOPATHI RAO S/o MIRYALA VENKAT RAO (Old Name), H.No. 9-4-187, Srinagar Colony, Sapthagiri Colony, Dist: Karimnagar. Have Changed my Name as MIRIYALA BHOOPATHI RAO S/o MIRIYALA VENKAT RAO (New Name) [K-1219953]

BUSINESS OFFER

■ Invest in Trading with small amount and get daily returns, 100% security. Ph: 8317689472 [H-787438]

■ పర్మినెంట్ బిజినెస్ పన్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజీ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ల అనుభవం. ఫోన్ : 9908743603 [HA-5600]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషుల కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ హాస్పిటల్ అన్య సిటీ స్కాన్ నందు పనిచేయుటకు లేడి రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర॥ సెల్: 9948422323 [K-1219964]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190572]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792805]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి

- ఇంజక్షన్ ఇచ్చిన 15 నిమిషాలకు అస్వస్థత
- మృతుని బంధువుల ఆందోళన
- సిరిసిల్లలో కిలోమీటర్నర మేర శవయాత్ర


సిరిసిల్ల ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య


సిరిసిల్లలో ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు


తిరుపతి(ఫైల్)

సిరిసిల్ల/చందుర్తి(వేములవాడ): ఆర్‌ఎంపీ వైద్యం వికటించి కొండాపూర్ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌తండాలో శనివారం విషాదం నెలకొంది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయని.. న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు సిరిసిల్లలో ధర్నా చేపట్టారు. లకావత్ తిరుపతి(30) రెండు రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. నిమ్మపల్లిలోని ఆర్‌ఎంపీ ప్రసాద్ వద్దకు వెళ్లగా ఇంజక్షన్ ఇచ్చారు. తర్వాత 15 నిమిషాలకు తిరుపతి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆర్‌ఎంపీ తన కారులో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రి లోపలికి తరలించే క్రమంలోనే తిరుపతి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కుటుంబసభ్యులు కోనరావుపేట మండలం కొలనూర్ శివారులో శవంతో రోడ్డుపై బైఠాయించారు. చందుర్తి, సిరిసిల్ల పట్టణ సీఐలు కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడినా శాంతించలేదు. సీఐలు జోక్యం చేసుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు.

వారంలో గల్ఫ్ వెళ్లేవాడు

మరో వారం రోజుల్లో గల్ఫ్ వెళ్లేవాడు. గతంలో గల్ఫ్ వెళ్లి ఏడాన్నర క్రితమే స్వగ్రామం వచ్చి పెళ్లి చేసుకున్నాడు. మృతునికి ఏడాది కుమారుడు, భార్య భారతి ప్రస్తుతం గర్భవతి.

క్లీనిక్ సీజ్

గిరిజన యువకుడి మృతికి కారణమైన నిమ్మపల్లికి చెందిన ఆర్‌ఎంపీ చేపూరి ప్రసాద్ క్లీనిక్‌ను డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు శనివారం సాయంత్రం సీజ్ చేశారు. కోనరావుపేట మెడికల్ ఆఫీసర్ వేణుమాధవ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్లలో ఉద్రిక్తం

తిరుపతి శవాన్ని నిమ్మపల్లికి తీసుకెళ్లి ఆర్‌ఎంపీ ఇంటి ముందు వేయాలని మృతుడి బంధువులు ప్రయత్నించారు. ఈక్రమంలో పోస్టుమార్టం వద్ద ఉన్న శవాన్ని ఎత్తుకొని వెళ్లేందుకు గ్రామస్తులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయినా.. పోలీసులను దూషిస్తూ మృతుడి బంధువులు కోనరావుపేటమార్గంలో ముందుకు సాగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారి జరిగిన తోపులాటలో మృతుడి బంధువులు, పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ.. పలుచోట్ల శవంతో రాస్తారోకో చేశారు. అదనపు పోలీసు బలగాలను రప్పించి సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్తచెరువు కట్ట వద్ద శవయాత్రను అడ్డుకున్నారు. ఎట్టకేలకు డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేశ్, పలువురు ఎస్సైలు, మహిళా ఎస్సైలు, పోలీసులు తిరుపతి శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఫలించని చర్చలు

ఆర్‌ఎంపీ ఇంజక్షన్ వికటించి తిరుపతి మరణించాడని, ఆయన కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సదరు ఆర్‌ఎంపీ ప్రసాద్ రూ.2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. తిరుపతి గతంలో ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి వచ్చాడు. అతని భార్య భారతి ఇప్పుడు గర్భవతి. కొడుకు స్నేహిత్, తల్లిదండ్రులు హంసవ్వ, గోపాల్ ఉన్నారు. తిరుపతి మృతి అటు కొండాపూర్‌హన్మాన్ తండాలో విషాదం నింపగా.. జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో ఉద్రిక్తతకు దారితీసింది. సిరిసిల్ల పోస్టుమార్టం వద్ద శనివారం అర్ధరాత్రి వరకు పోలీసు బలగాలు రక్షణగా ఉన్నాయి.